

మహాలయ అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం చెన్నై మెరీనా తీరంలో పితృ దేవతలకు పూజలు చేస్తున్న ప్రజలు

ప్రభుత్వ తీరును ఖండిస్తూ అన్నాడీఎంకే మానవహారం 8న

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలు పలు కష్టాలు ఎదుర్కోవడానికి కారణమైన డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పెంచిన ఆస్తిపన్ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 8న అన్నాడీఎంకే తరఫున అన్ని నగరపాలక, పురపాలక, పట్టణ పంచాయతీలలో మానవహారం చేపడుతున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ప్రకటన విడుదల చేశారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడల్లా ప్రజలు బయటికి రాలేనిస్థాయికి శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు. ధరలు అమాంతం పెరిగాయని, వ్యాపారులు స్వతంత్రంగా వ్యాపారం చేయలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్న అన్నాడీఎంకే ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ అవినీతిని తరచూ ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోరాడుతామని పేర్కొన్నారు. 8న ఉదయం 10.30కు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మానవహారం నిర్వహిస్తామని చెప్పారు.



ఊరేగింపుగా తిరుమలకు బయల్దేరిన స్వామివారి గొడుగులు





పూర్ణకుంభ స్వాగతం, కర్పూర హారతి పడుతున్న భక్తులు



తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హిందూ ధర్మార్థ సమితి తరఫున చెన్నై చెన్నకేశవ పెరుమాళ్ ఆలయం నుంచి గొడుగుల ఊరేగింపును ప్రారంభిస్తున్న రామానుజ జీయ్యర్, సమితి ట్రస్టీ ఆర్.ఆర్.గోపాల్‌జీ

రాష్ట్రంలో దళితులకు అన్యాయం

గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళితులకు అన్యాయం జరుగుతోందని గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆరోపించారు. గాంధీ జయంతి సందర్భంగా అడయారు గాంధీ మండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. కాలంలో చెరిగిపోని సిద్ధాంతాలను మహాత్మాగాంధీ నినదించారన్నారు. స్థిరమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని అభివృద్ధి చేయడానికి అవి గతం కన్నా నేడే చాలా అవసరమని తెలిపారు. తమిళనాడులో సామాజికన్యాయ నినాదం విస్తారంగా ఉన్నా దళితులకు జరిగిన అన్యాయాలు బాధాకరమని పేర్కొన్నారు. మూడేళ్లలో దళితులకు వ్యతిరేకమైన నేరాలు 40శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్సీఆర్‌బీ గణాంకాలు ప్రకారం లైంగిక వేధింపులకు గురైన ఎస్సీ బాధితుల కేసుల్లో శిక్షింపబడినవారి శాతం జాతీయ సరాసరిలో సగంగా ఉందన్నారు. మానవ వ్యర్థాలను మానవులే తొలగించే విధానంతో ఏటా దళితులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లకురిచ్చి, చెంగల్పట్టు, విళుపురం జిల్లాల్లో జరిగిన కల్తీసారా దుర్ఘటనలు ద్వారా దళిత కుటుంబాలు తొలిసారి సారా మాఫియా ద్వారా నష్టపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సమాజానికి నిస్వార్థ సేవలు అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ గాంధేయవాదులను గవర్నర్ సత్కరించారు. గాంధీమండపంలోని శుభ్రతా కార్మికులను కూడా సత్కరించారు. పలు రంగాల్లో రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నవారికి పురస్కారాలు ప్రదానం చేశారు.



గాంధీ మండపంలో ప్రసంగిస్తున్న గవర్నర్

ఖాదీ గ్రామోద్యోగ్ భవన్ ఖాదీ విక్రయాలను ప్రారంభించి అక్కడి ఖాదీ ఉత్పత్తులు పరిశీలించారు. గాంధీ జయంతి సందర్భంగా రాజ్‌భవన్ ప్రాంగణం, గాంధీ మండపం ప్రాంగణంలోని గాంధీ విగ్రహాలు వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటాలకు గవర్నర్ పుష్పాంజలి ఘటించారు.



మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా రాజ్‌భవన్ ప్రాంగణంలో బుధవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

ఖాదీ ఉత్పత్తులు కొనుగోలు చేయండి

ముఖ్యమంత్రి పిలుపు

చెన్నై, న్యూస్‌టుడే: ఖాదీ ఉత్పత్తులను ఎక్కువగా కొనుగోలు చేసి దేశానికి పటిష్ఠత చేకూర్చాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఎగ్మూర్ మ్యూజియం ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన చిత్రపటానికి ముఖ్యమంత్రి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. వెంట ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉన్నారు.

భారతదేశ ఆత్మ..

అహింస, సత్యం, మతసామరస్యానికి నిలువెత్తు రూపం గాంధీ అని, ఆయన్ను భారతదేశ ఆత్మగా చెప్పడం అతిశయోక్తి కాదని తెలిపారు. గాంధీ జీవించిన కాలం కన్నా ప్రస్తుత పరిస్థితుల్లోనే ఆయన అవసరం ఎక్కువగా ఉందన్నారు. భారతదేశ ప్రజలను విభజించిన శక్తులను పతనం చేసి, జాతిపిత చూడాలని ఆకాంక్షించిన సౌభ్రాతృత్వ ఇండియాను మళ్లీ వికసింప చేసి ఆయనకు కానుకగా అందిద్దామంటూ పిలుపునిచ్చారు. తన ప్రకటనలో... రాష్ట్రంలోని ఖాదీ పరిశ్రమ, కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఖాదీ, గ్రామీణ హస్తకళాకారుల ఉత్పత్తులను మార్కెట్ల ద్వారా విక్రయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి సహకరిస్తోందని తెలిపారు. ప్రజలకు తక్కువ ధరకు ఖాదీ ఉత్పత్తుల రకాలను అందించాలనే ఉద్దేశంతో ఏడాది పొడవునా 30శాతం విక్రయ తగ్గింపునకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు.





ఎగ్మూర్ మ్యూజియంలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి తదితరులు · విద్యార్థుల పుష్పాంజలి

దుష్ప్రచారం కొనసాగిస్తే దేశవ్యాప్త ఆందోళనలు: కాంగ్రెస్

చెన్నై, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై దుష్ప్రచారం కొనసాగిస్తే దేశవ్యాప్త ఆందోళనలు తప్పవని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై హెచ్చరించారు. రాహుల్‌గాంధీ వ్యవహారంలో ఆర్ఎస్ఎస్, భాజపా తీరును ఖండిస్తూ టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం జాగృతి ర్యాలీ జరిగింది. జింఖానా క్లబ్ సమీపాన కామరాజర్ విగ్రహం నుంచి కొనసాగిన ర్యాలీని టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు కృష్ణసామి, ఈవీకేఎస్ ఇళంగోవన్ జెండా ఊపి ప్రారంభించారు. ఎగ్మూర్ మ్యూజియంలోని గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఎంపీ విష్ణు ప్రసాద్, టీఎన్‌సీసీ కోశాధికారి, ఎమ్మెల్యే రూబి మనోహరన్, ఇతర నిర్వాహకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో సెల్వ పెరుంతగై మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జయంతికి, ఆర్ఎస్ఎస్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈవీకేఎస్ ఇళంగోవన్ మాట్లాడుతూ.. .. గాడ్సేకు నివాళులు అర్పించేవారు గాంధీ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. 100 రోజులు దాటామని మోదీ అంటున్నారని, మరో 150 రోజుల్లో పార్లమెంట్ నుంచి గెంటివేతకు గురవుతారని పేర్కొన్నారు. కామరాజర్ వర్ధంతి సందర్భంగా జింఖానా క్లబ్ సమీపాన ఉన్న ఆయన విగ్రహానికి టీఎన్‌సీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● గాంధీ జయంతి, కామరాజర్ వర్ధంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ముప్పెరుం వేడుకగా సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ నిర్వహించింది. వారి చిత్రపటాలకు నివాళులర్పించింది. గిండిలోని కామరాజర్ స్మారక ప్రదేశంలో ఉన్న సమాధికి నివాళులర్పించారు.



ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నేతలు, శ్రేణులు

మద్యం దుకాణాలు మూసేయాలి: హెచ్.రాజా


ఆర్కేనగర్, న్యూస్‌టుడే: భాజపాకు 18శాతం ఓట్లు మోదీ కారణంగానే వచ్చాయని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి హెచ్.రాజా తెలిపారు. పుదుకోట్టై జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. డీఎంకే మద్యాన్ని ప్రోత్సహించే ప్రభుత్వమన్నారు. 500 మద్యం దుకాణాలు మూసేస్తామని చెప్పి వెయ్యి ప్రైవేట్ క్లబ్‌లు, దుకాణాలకు అనుమతి ఇచ్చిందన్నారు. మద్యం కారణంగా కళ్లకురిచ్చిలో 65 మంది ప్రాణాలు కోల్పోతే ఈ ప్రభుత్వం మనస్సాక్షి లేకుండా ఈ ఏడాది మద్యం దుకాణాల ద్వారా రూ.1700 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపిందన్నారు. మద్యం దుకాణాలు ప్రారంభించినవారే మూసేయాలన్నారు. డీఎంకే పాలనలోకి వచ్చిన తర్వాత దేవదాయశాఖ ద్వారా పునరుద్ధరించిన ఆలయాలను క్షేత్రస్థాయి పరిశీలన జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని చెప్పారు. ఆలయ పునరుద్ధరణ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే 15శాతం ఓట్లు మాత్రమే పొందిందన్నారు.

రజనీకాంత్ కోలుకోవాలని పూజలు

ప్యారిస్, న్యూస్‌టుడే: నటుడు రజనీకాంత్ అనారోగ్యంతో సెప్టెంబరు 30న చెన్నై థౌజండ్‌లైట్‌లో ఉన్న అపోలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఈ నేపథ్యంలో ఆయన పూర్తిగా కోలుకోవాలని మదురైలోని ఆయన అభిమానులు మదురై మీనాక్షి అమ్మన్ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే లతా రజనీకాంత్‌కు మంగళ భాగ్యం నిలబడాలని అమ్మవారి ముందు గాజులు, కుంకుమ సారెను 500 మంది పైగా మహిళలకు అందించారు. తూత్తుక్కుడిలో అభిమానులు ఆలయాల్లో, క్రైస్తవ దేవాలయాలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విల్లివాక్కం: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన నటుడు రజినీకాంత్ త్వరలో కోలుకోవాలని రాజకీయ, సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా ట్వీట్ చేస్తున్నారు. ఈ క్రమంలో రజినీకాంత్ త్వరలో సంపూర్ణంగా స్వస్థత పొందాలని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో నమోదు చేశారు. రజినీకాంత్ సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని అందులో పేర్కొన్నారు.

చెన్నై: అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నటుడు రజనీకాంత్ త్వరగా కోలుకోవాలని నటుడు, మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ ఆకాంక్షించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... 'ఆస్పత్రిలో చేరిన నా ప్రియ మిత్రుడు, సూపర్‌స్టార్ రజనీకాంత్ త్వరలో పరిపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అని తెలిపారు.



మీనాక్షి అమ్మన్ ఆలయంలో పూజలు చేసిన అభిమానులు

నీలగిరిలో 'ఇ-పాస్' కొనసాగింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు సూచనల మేరకు నీలగిరిలో మే 7 నుంచి వాహనాలకు 'ఇ-పాస్' ఉంటేనే అనుమతిస్తున్నారు. సెప్టెంబరు 30 వరకు పొడిగించారు. మళ్లీ ప్రకటన వెలువరించేంత వరకు ఆ పద్ధతి అమల్లో ఉంటుందని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ లక్ష్మీభవ్య తన్నీరు మాట్లాడుతూ.. గత 5 నెలల్లో 'ఇ-పాస్' పొందిన 2.75 లక్షల వాహనాల్లో 13 లక్షల మంది పర్యాటకులు నీలగిరికి వచ్చినట్లు పేర్కొన్నారు.

రాకపోకలకు అంతరాయం.. అంతర్జాతీయ పర్యాటక ప్రాంతమైన నీలగిరికి ఏటా 30 లక్షల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. ఏప్రిల్, మే నెలల్లో ఆ సంఖ్య 10 లక్షల వరకు ఉంటుంది. ఒకే సమయంలో ఎక్కువ మంది రాకతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కనీస సౌకర్యాలు సక్రమంగా లేనందున పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. వాహన రద్దీతో స్థానికులు ఉద్యోగాలకు, విద్యార్థులు పాఠశాలలకు సకాలంలో వెళ్లలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకుల రాకపై ఆంక్షలు విధించడానికి 'ఇ-పాస్' పద్ధతిని ప్రవేశపెట్టారు.



నీలగిరిలో పర్యాటకుల వాహనాలు



కామరాజర్ వర్ధంతి సందర్భంగా గిండిలోని కామరాజర్ స్మారకం వద్ద అన్నాడీఎంకే తరఫున నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ విజయకుమార్, మంత్రులు జయకుమార్, పొన్నయ్యన్, మాజీ ఎమ్మెల్యేలు రవి, అశోక్ తదితరులు

కామరాజర్ మార్గంలో నడుద్దాం: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: మాజీ సీఎం కామరాజర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశాన్ని పోస్టు చేశారు. అందులో.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి కష్టాలు అనుభవించి, తర్వాతి కాలంలో ముఖ్యమంత్రిగా తమిళనాడులో పాఠశాల విద్య, పరిశ్రమల అభివృద్ధికి బలమైన పునాదిని కామరాజర్ వేశారని స్మరించుకున్నారు. గాంధీయ మార్గం నుంచి చివరివరకు తలొగ్గని ఆయన జీవితం చూపించే మార్గంలో నడుద్దామంటూ పిలుపునిచ్చారు.

ఆస్తుల జప్తునకు ఈడీకి అధికారాలున్నాయి: హైకోర్టు

ఈనాడు-చెన్నై: మనీలాండరింగ్ కేసులో నేరానికి సంబంధించిన ఆస్తులు విదేశాల్లో ఉంటే, దానికి సమానమైన ఆస్తుల్ని భారతదేశంలోనూ జప్తు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్(ఈడీ)కి ఉందని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. నేరం చేయడానికి ముందు ఈ ఆస్తులు కొనుగోలు చేసి ఉంటే వాటిని సైతం జప్తు చేయవచ్చని పేర్కొంది. ఈడీ కేసు కొట్టివేయాలని కోరుతూ స్టెర్లింగ్ ఫ్యూచర్స్ అండ్ హాలిడేస్ లిమిటెడ్, ఎస్ఎన్ ఇండియా లిమిటెడ్ అండ్ చెన్నై ప్రాపర్టీస్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పిటిషన్లను కొట్టివేస్తూ డివిజన్ బెంచి జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియం, జస్టిస్ వి.శివజ్ఞానం ధర్మాసనం ఈ తరహా వ్యాఖ్యలు చేసింది. సదరు కంపెనీలు ఐడీబీఐ బ్యాంకు నుంచి రెండుసార్లు 119 మిలియన్ డాలర్ల రుణాన్ని అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో ఈడీ కేసు నమోదుచేసింది. ఈ కేసు నేపథ్యంగా ఆస్తుల అటాచ్ వ్యవహారం నడిచింది. 2010-17 మధ్య ఆయా కంపెనీలు నేరానికి పాల్పడగా.. 1975లో కొన్ని ఆస్తుల్ని ఈడీ జప్తు చేసింది. దీనిపై కంపెనీలు కోర్టుకెళ్లగా వారి వాదనని ధర్మాసనం తిరస్కరించింది.

పాంబన్‌పై 'టెస్ట్ లిఫ్ట్' విజయవంతం

వడపళని, న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన పాంబన్ రైలు వంతెనపై వెర్టికల్ సెక్షనులో టెస్ట్ లిఫ్టును ఇంజినీర్లు విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం 630 టన్నుల బరువుతో ట్రయల్ కూడా జరిగిందని దక్షిణ రైల్వే తెలిపింది. రూ.550 కోట్లతో వంతెన ఏర్పాటు చేశారు. కొత్త వంతెన సముద్రంపై 100 స్పాన్లతో కూడుకుని ఉంది. ఇందులో 99 స్పాన్లు 18.3 మీటర్లు, ఒకటి 72.5 మీటర్లు ఉన్నాయి. వంతెన కింద నుంచి నౌకలు తేలికగా వెళ్లడానికి వీలుగా నిర్మాణం చేపట్టారు. ఆటోమేటెడ్ ఎలక్ట్రో మెకానికల్ విధానంతో నౌకలు వెళ్లడానికి 'నావిగేషనల్ స్పాన్'ను 17 మీటర్ల ఎత్తు వరకు లేపే వీలుందని అధికారులు పేర్కొన్నారు. అధునాతన సాంకేతిక విధానం, నాణ్యతతో కూడిన, పటిష్ఠమైన పరికరాలతో నిర్మించిన వంతెనపై రైళ్ల రాకపోకలు కూడా సజావుగా సాగుతాయన్నారు.



ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు లింకురోడ్లు



వడపళని, న్యూస్‌టుడే: నగరంలో ప్రస్తుతం మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టు పనులు 118 కి.మీ. మేర వేర్వేరు మార్గాల్లో చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాల్లో పైవంతెనలు, ఇతర పనులు చేపట్టారు. ఫలితంగా నగరవ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యలు, వన్‌వేలు ఎక్కువైపోయాయి. వాటిని అధిగమించి, ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ప్రభుత్వం కొత్తగా అనుసంధాన రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తోంది.

రూ.37.8 కోట్లతో..

మైలాపూరు, గ్రీన్‌వేస్ రోడ్డు, శాంథోమ్ మీదుగా అడయార్, గిండీ చేరుకునేందుకు డీజీఎస్ దినకరన్ సాలైను దుర్గాబాయి దేశ్‌ముఖ్ రోడ్డుతో కలుపుతూ మరో ప్రత్యామ్నాయ మార్గం నిర్మాణానికి కూడా ప్రతిపాదన జరిగింది. రూ.37.8 కోట్లతో ప్రాజెక్టు చేపట్టడానికి రాష్ట్ర హైవేస్ విభాగం టెండర్లు కూడా ఆహ్వానించింది. ఈ ప్రాంతంలో జరిగే 630 మీటర్ల లింకు రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత దుర్గాభాయి దేశ్‌ముఖ్ రోడ్డులో ఉన్న మీడియన్ తొలగించి వన్‌వేగా మారుస్తారు. మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రెండు ప్రాజెక్టులను ఏడాదిలోగా ముగించాలనుకుంటున్నామని హైవేస్ విభాగ సీనియర్ అధికారి ఒకరన్నారు.

900 మీటర్ల లింకుతో..

పిళ్లయార్‌కోయిల్ వీధి, పాడికుప్పం మెయిన్‌రోడ్డు వరకు 900 మీటర్ల దూరానికి అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. ఈ మార్గం అమల్లోకి వస్తే జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోకి ప్రవేశించకుండా పూనమల్లి, మదురవాయల్‌కు బైపాస్‌రోడ్డు గుండా వెళ్లే వీలుంటుంది. రోడ్డు కూడా విస్తరించాలనుకుంటున్నారు. తద్వారా ద్విచక్ర, ఇతర వాహన చోదకులు కూడా రైల్‌నగర్ బ్రిడ్జి మీదుగా పూనమల్లి హైరోడ్డుకు చేరుకోవచ్చు.

మూడో అనుసంధాన మార్గం..

మెట్రో రైలు పనుల కారణంగా ట్రాఫిక్ నియంత్రణకు సెయింట్ థామస్ మౌంట్ నుంచి పూనమల్లి రోడ్డు వరకు తాత్కాలిక లింకురోడ్డు నిర్మాణం జరిగింది. ఈ రోడ్డు గుండా వాహనాలు మరో రెండేళ్ల వరకు తిరుగుతాయి. నందంబాక్కంలోని 'మద్రాస్ వార్ సిమెట్రీ' వద్ద రోడ్డు చాలా ఇరుకు కావడం, భట్ రోడ్డు, పాల్ వెల్స్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ, నిర్మాణ పనులతో వాహనాలను రక్షణ రంగానికి చెందిన స్థలంలో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు గుండా మళ్లించారు.

ఇలా వెళ్లాలి..

ట్రేడ్ సెంటర్ నుంచి కత్తిపారా కూడలి వైపునకు వెళ్లాల్సిన వాహనాలు 'ఏ2బి' సిగ్నల్ దాటాక ఎడమవైపు తిరిగి కంటోన్మెంట్ రోడ్డు, ధనకొట్టి రాజా వీధి, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ సౌత్ ఫేజ్ రోడ్డు నుంచి జీఎస్టీ రోడ్డుకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఒలింపియా కూడలి దాటి కత్తిపారా ఫ్లై ఓవర్ చేరుకోవచ్చు. ఇవి కాకుండా హైవేస్ విభాగం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్(జీసీసీ) కలిసి కొన్ని రోడ్లు మరమ్మతులు, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, గ్రీన్‌వేస్ రోడ్డులో అరడజను పైచిలుకు ప్రాంతాలను బాగా వెడల్పు చేయాలనే ఆలోచనలో ఉన్నాయి.



వాకథాన్‌లో పాల్గొన్న పీఎస్ వైద్య తదితరులు

ఆవడి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో 'వాకథాన్'

వడపళని, న్యూస్‌టుడే: ఈ నెల 8వ తేదీన 92వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆవడి ఎయిర్ ఫోర్స్ స్టేషనులో బుధవారం 'సద్భావన వాకథాన్' జరిగింది. వాకథాన్‌లో పురుషులు, మహిళలు, పిల్లలు 7 కి.మీ. నడిచారు. ఆవడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్, ఎయిర్ కమొడోర్ పీఎస్ వైద్య ఆధ్వర్యంలో వాయు యోధులు, రక్షణ రంగ భద్రతా సిబ్బంది, కుటుంబీకులు వాకథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వైద్య, ఎయిర్ ఫోర్స్ ఫ్యామిలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇంద్రాణి వైద్య బహుమతులు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాంబరం, పుదుతాంగల్, న్యూ కొలత్తూరు, కుమనన్‌చావడి ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ ప్రైవేటుకు

జీసీసీ యంత్రాంగం సన్నద్ధం



ప్రజా మరుగుదొడ్డి

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై వ్యాప్తంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లను ప్రైవేటీకరించేందుకు చెన్నై మహానగర కార్పొరేషన్(జీసీసీ) సిద్ధమైంది. సెంట్రల్ రైల్వే స్టేషను, కోయంబేడు మార్కెట్, బెసెంట్‌నగర్ బీచ్, గిండీ రైల్వే స్టేషన్లతో పాటు 1,002 ప్రాంతాల్లోని 7,166 మరుగుదొడ్లను రూ.1,167 కోట్లతో ప్రైవేటీకరించేందుకు కార్పొరేషన్ ఆమోదం కూడా తెలిపింది.

ఏడాది తర్వాత..

రాయపురం, తిరువీకా నగర్ ప్రాంతాల్లో ఏడాది కిందట రూ.430 కోట్లతో కార్పొరేషన్ ప్రైవేటుపరం చేసిన తర్వాత ఇతర ప్రాంతాల్లోనూ అప్పటించేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం చేపట్టనున్న ప్రాజెక్టును మూడు భాగాలుగా విభజించారు. రూ.350 కోట్లు, రూ.373 కోట్లు, రూ.443 కోట్లతో చేపట్టనున్న పనులకు తొమ్మిదేళ్ల పాటు నిర్వహణను కూడా గుత్తేదారులు చూసుకుంటారు. శుభ్రతకు ప్రాధాన్యం, సీసీ కెమెరాల నిఘా, నీటి సరఫరా వంటివాటిపై ప్రాజెక్టులో భాగంగా కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది.

తిరిగి నిర్మించాలి..

పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లు తిరిగి నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.150 కోట్ల మేరకు వెచ్చించాల్సి ఉంది. మొదటి సంవత్సరం నిర్వహణకు జీసీసీ మరో రూ.100 కోట్లు విడుదల చేయనుంది. మిగిలినది గుత్తేదారు పనితీరు పరిశీలించిన మీదట విడుదల చేస్తారు. ఈ ప్రాజెక్టుకు టెండర్లను 16న తెరవనున్నారు.

వ్యతిరేకత..

ప్రైవేటీకరణపై పలువురు కౌన్సిలర్ల నుంచి వ్యతిరేకత ఎదురైంది. జీసీసీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ కె.ధనశేఖరన్ మాట్లాడుతూ రాయపురం, తిరువీకానగర్‌లోని జీసీసీ మరుగుదొడ్ల నిర్వహణ గుత్తేదారు నిబంధనలు సరిగ్గా పాటించలేదన్నారు. ఆయనపై చర్య తీసుకోవడమో లేదా వివరణను జీసీసీ కోరాలన్నారు.

మూడు నెలల్లో..

పాడైనవాటి స్థానంలో నూతన మరుగుదొడ్ల నిర్మాణం మూడు నెలల్లోనే పూర్తి చేస్తామని మేయర్ ప్రియ అన్నారు. పలు ప్రైవేటు మరుగుదొడ్లు ఉన్నచోట సిబ్బంది కొరత ఉందన్నారు. బ్రాడ్వే, జార్జి టౌన్ ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న దౌర్జన్యకారులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై గుత్తేదారుతో చర్చించామని, తమ ఆధీనంలోకి తీసుకుంటామని కమిషనర్ జె.కుమారగురుబారన్ చెప్పారు.



అవార్డు అందిస్తున్న ఆచార్య సీఎంకే రెడ్డి

ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం


విల్లివాక్కం, న్యూస్‌టుడే: నగరంలోని మైలాపూర్ రాజ్‌పార్క్ హోటల్‌లో మంగళవారం రాత్రి రాష్ట్రంలోని మద్రాసు వాలంటరీ బ్లడ్ బ్యూరో, అసోసియేషన్ వాలంటరి బ్లడ్ డోనర్స్ తరఫున వార్షికోత్సవ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రక్తదానంలో ఉత్తమ సేవలందించిన పలు సంస్థల నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీఎఫ్ అధ్యక్షుడు, తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (టాంపా) అధ్యక్షుడు ఆచార్య చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశానికి 5 కోట్ల యూనిట్ల అవసరం ఉందని, కానీ ఏడాదికి 2.5 కోట్ల యూనిట్ల రక్తం మాత్రమే దానంగా అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 50 ఏళ్లుగా సాయం చేస్తున్న టీటీకే గ్రూప్ పీఎస్‌ఏ భాను, కర్ణాటక సంగీత విద్వాంసురాలు నిత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం గోవలన్ అతిథులకు ఆహ్వానం పలికారు.

సోమస్కంధర్ విగ్రహం అమెరికాలో గుర్తింపు

ప్యారిస్, కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం శ్రీఏకాంబరేశ్వరర్ ఆలయానికి చెందిన రూ.8 కోట్లు విలువైన సోమస్కంధర్ విగ్రహం అమెరికాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తమిళనాడు ఆలయాల నుంచి చోరీ చేసి విదేశాల్లో అక్రమంగా విక్రయించిన పురాతన విగ్రహాలను స్వాధీనం చేసుకునేందుకు విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగం ఐజీ దినకరన్ నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని మ్యూజియంలో ఓ కాంస్య విగ్రహం ఉన్నట్లు గుర్తించారు. ఈ విగ్రహం కాంచీపురం ఏకాంబరేశ్వరర్ ఆలయానికి చెందినదిగా మ్యూజియం వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. విగ్రహం పీఠంపై తెలుగు అక్షరాలతో విగ్రహాన్ని దానం చేసిన దాత పేరు, ఈ విగ్రహాన్ని కాంచీపురం ఏకాంబరేశ్వరర్ (ఏకాంబరనాథర్) ఆలయానికి వితరణగా ఇచ్చినట్లు రాసి ఉంది. ఈ విగ్రహం అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.8 కోట్లు ఉంటుందని, ఆ విగ్రహ నిర్మాణం, అక్షరాలను చూస్తే 18వ శతాబ్దానికి చెందినదిగా తెలుస్తోంది. విగ్రహాన్ని ఇండియాకు తీసుకురావడానికి విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగం పోలీసులు చర్యలు చేపట్టారు.



సోమ స్కంధర్ విగ్రహం



విగ్రహం పీఠంపై రాసిన తెలుగు అక్షరాలు

ఆస్పత్రి నుంచి మంత్రి అన్బిల్ డిశ్చార్జ్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి కాంచీపురం ఉత్తరమేరూర్ ప్రాంతంలో మంగళవారం పాఠశాల భవనాలు, గ్రంథాలయాలను పరిశీలించారు. అనంతరం చెన్నై తిరుగు ప్రయాణమవగా ఆకస్మికంగా కడుపునొప్పి రావడంతో అమైందకరైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం కుదుటపడటంతో బుధవారం డిశ్చార్జి అయ్యారు.

భక్తిశ్రద్ధలతో మాళి అమావాస్య

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ కొత్త బస్టాండు సమీపంలోని పాలారు నదిలో మాళి అమావాస్య సందర్భంగా బుధవారం మృతులకు వారి బంధువులు తర్పణాలు చెల్లించారు. అనంతరం ఇళ్లకు వెళ్లి ప్రసాదాలు తయారుచేసి నైవేద్యం సమర్పించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



తర్పణాలు చెల్లిస్తున్న దృశ్యం

తామరభరణి నదిని పరిశీలించిన కమిషనర్

తిరునెల్వేలి, న్యూస్‌టుడే: తిరునెల్వేలి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టరు ఎన్.ఓ.సుఖపుత్ర తచ్చనల్లూర్ జోన్ వణ్ణార పేట రోడ్డు వీధిలో గల తామరభరణి నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న శుద్ధీకరణ వ్యవస్థను బుధవారం పరిశీలించారు. మురుగునీటిని భూగర్భ డ్రైనేజీ పథకం ద్వారా తామ్రబరణి నది పరివాహక ప్రాంతంలో గల శుద్ధీకరణ ప్లాంట్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి పంపింగ్ స్టేషన్ పంపే పనులు జరుగుతున్నాయి. పనులను కమిషన్ సుఖపుత్ర పర్యవేక్షించారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(బాధ్యతలు) రవి, అసిస్టెంటు కమిషనరు జాన్‌సన్ దేవసహాయం, అధికారులు పాల్గొన్నారు.

కూడుతురైలో పోటెత్తిన భక్తులు



కూడుతురైలో భక్తుల సందడి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య సందర్భంగా ప్రజలు నదులు, సముద్రాల్లో స్నానమాచరించి పూర్వీకులకు తర్పణాలు వదులుతారు. ఈరోడ్ జిల్లా భవాని కూడుతురైకు బుధవారం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. వేకువ జాము నుంచే నదిలో స్నానాలుచేసి పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. అనంతరం సంగమేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బీచ్‌లో పారిశుద్ధ్య పనులు



తొలగించిన వ్యర్థాలతో పోర్ట్ ట్రస్టు సిబ్బంది, అధికారులు

వడపళని, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతా దివాస్ 2024' కార్యక్రమాల్లో భాగంగా చెన్నై పోర్ట్ ఆధ్వర్యంలో బుధవారం బీచ్‌లో శుభ్రత పనులు జరిగాయి. చెన్నై ఛైర్మన్ ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో పలువురు శుభ్రత పనుల్లో పాల్గొన్నారు. చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్ పర్సన్, కామరాజర్ పోర్ట్ లిమిటెడ్ ఛైర్మన్ సునీల్ పాలివాల్ తదితరులు హాజరయ్యారు.

మనల్ రవిచంద్రన్ మృతికి ఈపీఎస్ సంతాపం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మనల్ రవిచంద్రన్ మృతికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిసామి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేస్తూ నార్త్ చెన్నై ఈస్ట్ జిల్లా పెరంబూరు వెస్ట్ ప్రాంతీయ కార్యదర్శి మనల్ ఎస్ఎన్‌జె రవిచంద్రన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పితృదేవతలకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ప్రజలు

కాంచీపురం, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం ఉమ్మడి కాంచీపురం జిల్లాలో అనేక ప్రాంతాల్లో పుష్కరిణులు, మహాబలిపురం తీరంలోను ప్రజలు తమ పితృ దేవతలకు తర్పణాలిచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కాంచీపురం నగరంలోని తాయర్ కొలను, సర్వతీర్థ కొలను, కచ్చపేశ్వరాలయం, తిరుప్పు కుళి విజయరాఘవ పెరుమాళ్ ఆలయం పాలారు, చెయ్యారు నది తీరాల్లో ప్రజలు తమ పితృ దేవతలకు తర్పణాలిచ్చి ఇళ్లలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సముద్ర తీరంలో, తిరుక్కళి కుండ్రం, తిరుప్పోరూర్, మొదలైన ప్రాంతాల్లోని ఆలయాల పుష్కరిణుల్లో ప్రజలు మహాలయ అమావాస్యను పురస్కరించుకొని పితృదేవతలకు తర్పణాలిచ్చారు.





ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉదయనిధిని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి టీఎం అన్బరసన్, డీఎంకే రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి, కాంచీపురం ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్
- కాంచీపురం, న్యూస్‌టుడే

శ్రీలంక దౌత్య కార్యాలయం ముట్టడి 8న

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్ర మత్స్యకారులపై శ్రీలంక అణచివేత వైఖరిని ఖండిస్తూ పీఎంకే తరఫున ఈ నెల 8వ తేది శ్రీలంక దౌత్య కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టనున్నట్లు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్తున్న రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడి చేపల వేట పరికరాలను ధ్వంసం చేస్తోందని మండిపడ్డారు. చేపల వేట హక్కుకు విలువ ఇవ్వాలని, శ్రీలంక నావికాదళం హద్దు మీరుతోందని అన్నారు. రాష్ట్ర మత్స్యకారుల హక్కులను కాపాడేందుకు చేపట్టే ఆందోళనలో పీఎంకే నిర్వాహకులు పాల్గొనాలని అన్బుమణి పిలుపునిచ్చారు.

శుభ్రత జీవన విధానంగా మారాలి: ఎల్జీ కైలాష్‌నాథన్



మొక్క అందిస్తున్న ఎల్జీ కైలాష్‌నాథన్, సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: శుభ్రత పాటించడాన్ని జీవనవిధానంగా మార్చుకోవాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ తెలిపారు. పుదుచ్చేరి మున్సిపాలిటీ తరఫున కంబన్ కలైయరంగంలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఎల్జీ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి పాల్గొన్నారు. 'ఒరు తాయిన్ పెయరిల్ ఒరు మరం' అనే పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఎల్జీ మాట్లాడుతూ దేశాన్ని శుభ్రంగా ఉంచుకోవడం ప్రభుత్వం లేదా పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే సంబంధించినది కాదని, అందరం ఆ విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. మన చుట్టుపక్కల ప్రాంతాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు సోకవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదన్నారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసు సీబీఐకి బదిలీ

ప్యారిస్, న్యూస్‌టుడే: బాలికపై లైంగిక వేధింపుల కేసును సీబీఐకి బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నై అన్నానగర్‌కి చెందిన పదేళ్ల బాలికను లైంగిక వేధింపులకి గురిచేసినట్లు పక్కింటి బాలుడిపై తల్లిదండ్రులు అన్నానగర్ ఆల్ ఉమెన్ పోలీసులకి ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అప్పుడు పోలీసు ఇన్‌స్పెక్టరు తమపై దాడిచేసి, బాలుడి పేరు ఫిర్యాదు నుంచి తొలగించాలని హింసించినట్లు బాలిక తల్లిదండ్రులు వీడియో విడుదల చేశారు. ఈ విషయమై మద్రాసు హైకోర్టు సుమోటోగా విచారణకు తీసుకుంది. బాలిక తల్లి హెబియస్ కార్పస్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఈ రెండూ మంగళవారం విచారణకు వచ్చాయి. న్యాయమూర్తులు.. పోక్సో కేసు విచారించే పోలీసులకు తగిన శిక్షణ ఇవ్వాలని, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని ఉత్తర్వులు ఇచ్చారు. బాధితుల గుర్తింపు కాపాడాలని, బాధితురాలి నుంచి ఆస్పత్రి లిఫ్ట్ వద్ద వాగ్మూలం తీసుకోవడం తప్పు అన్నారు. తగిన పరిహారం పొందేందుకు బాలిక తల్లిదండ్రులు సంబంధిత కోర్టు ఆశ్రయించాలని న్యాయమూర్తులు తెలిపారు.

విన్యాసాలు తిలకించేందుకు సరైన రవాణా వినియోగించుకోండి

వడపళని, న్యూస్‌టుడే: మెరీనాలో 6న వాయు విన్యాసాలు తిలకించేందుకు వచ్చేవారు సరైన రవాణా సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీస్ (జీటీసీపీ) బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. మెట్రో రైలు, ఎమ్మార్టీఎస్ రైళ్ల సేవలు వినియోగించుకోవాలని పేర్కొంది. ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విన్యాసాలు జరగనున్నాయి. విన్యాసాలకు ప్రధాన వేదిక వివేకానంద హౌజ్ వద్ద ఏర్పాటు చేశారు. ప్రజలందరూ మెరీనా ప్రాంతం నుంచి వీక్షించే వీలుంటుంది. లైట్‌హౌజ్ నుంచి అడయార్‌లోని ఇండియన్ నావల్ స్టేషన్(ఐఎన్ఎస్) వరకు విన్యాసాలు కొనసాగుతాయి.

క్రీడాకారులకు ఘన స్వాగతం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన వరల్డ్ కప్ కిక్ బాక్సింగ్‌లో 8 పతకాలు సాధించిన తమిళ క్రీడాకారులకు చెన్నై విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. సెప్టెంబరు 24 నుంచి 29 వరకు వరల్డ్‌కప్ కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. భారత్ సహా 81 దేశాలకు చెందిన 2 వేలకు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. భారత జట్టులో తమిళనాడు నుంచి 11 మంది పాల్గొన్నారు. తమిళనాడు క్రీడాకారులు 2 బంగారు పతకాలు సహా 8 పతకాలు సాధించారు. వారంతా మంగళవారం చెన్నై విమానాశ్రయానికి చేరుకోగా ఘన స్వాగతం పలికారు.

ఉప ముఖ్యమంత్రి కార్యదర్శిగా ప్రదీప్ యాదవ్



చెన్నై, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కార్యదర్శిగా ప్రదీప్‌యాదవ్ నియమితులయ్యారు. ఉదయనిధి స్టాలిన్‌కు ప్రస్తుతం క్యాబినెట్‌లో మూడో స్థానం కల్పించారు. ప్రదీప్ యాదవ్ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, రహదారుల శాఖ కార్యదర్శిగా వ్యవహరించారు. పునర్వ్యవస్థీకరించిన మంత్రివర్గం తొలి సమావేశం 8న ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనుంది.

2026 ఎన్నికల్లో ఐక్య జనతాదళ్ పోటీ



మాట్లాడుతున్న మణినందన్

తిరునెల్వేలి, న్యూస్‌టుడే: 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఐక్య జనతాదళ్ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మణి నందన్ తెలిపారు. తిరునెల్వేలిలో ఒక హోటల్‌లో బుధవారం ఐక్య జనతాదళ్ సాధారణ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సోమసుందరం నేతృత్వంలో, రాష్ట్ర అధ్యక్షుడు మణినాథన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మణినాథన్ మాట్లాడుతూ 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఐక్య జనతాదళం పోటీ చేస్తుందని, ఈమేరకు తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. ఏదైనా ఒక పార్టీతో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తామని ఒక వేళ పొత్తులు కుదరక పోతే 234 నియోజక వర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని తెలిపారు. తమిళనాడులో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. లేకుంటే ఐక్య జనతా దళం తరపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

బొమ్మల కొలువు ప్రదర్శన



పరిశీలిస్తున్న కణ్ణప్పన్ తదితరులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం చెన్నై బ్రాడ్వే కురళగంలోని ఖాదీ దుకాణంలో ఖాదీ శాఖమంత్రి ఆర్ఎస్ రాజకణ్ణప్పన్ నవరాత్రి బొమ్మల కొలువు, దీపావళి ఖాదీ ప్రత్యేక విక్రయాలు ప్రారంభించారు. మంత్రులు మా.సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, నగరపాలక సంస్థ మేయర్ ఆర్.ప్రియ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పొన్ముడికి శాఖ మార్పునకు గవర్నర్‌తో విభేదాలు కారణం కాదు

మంత్రి రఘుపతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మంత్రి పొన్ముడి శాఖ మార్పునకు గవర్నర్‌తో విభేదాలు కారణం కాదని న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. బుధవారం పుదుకోట్టైలో విలేకరులతో మాట్లాడారు. ఉన్నతవిద్యాశాఖ అణగారిన వర్గాలకు అందాలనే ఉద్దేశంతో మార్చినట్లు తెలిపారు. తాను న్యాయ కళాశాల స్నాతకోత్సవాన్ని బహిష్కరించలేదని, ఆ రోజు వేరే పనులు ఉండటంతో పాల్గొనలేకపోయానని చెప్పారు. మనో తంగరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తుండటంతో పదవి పోయిందని చెప్పడం అవాస్తవమని తెలిపారు. పుదుకోట్టై జిల్లా జైల్లో ఖైదీల అస్వస్థతకు తాగునీటి కుళాయిలో మరమ్మతులే కారణమన్నారు. వెంటనే సరిచేశామన్నారు.

వీహెచ్‌పీ మాజీ ఉపాధ్యక్షుడిపై అభియోగపత్రం దాఖలు

ప్యారిస్, న్యూస్‌టుడే: అంబేడ్కర్, తిరువళ్లువర్‌పై చర్చనీయాంశ వ్యాఖ్యలు చేసిన విశ్వ హిందూ పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఆర్‌బీవీఎస్ మణియన్‌పై సెషన్స్‌కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. చెన్నై టీనగర్‌లో గతేడాది సెప్టెంబరు 11న జరిగిన సమావేశంలో ఆర్‌బీవీఎస్ మణియన్ తిరువళ్లువర్, అంబేడ్కర్, దళితులను కించపరిచేలా మాట్లాడినట్లు వీసీకే తరఫున పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై బయటికొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనపై 200 పేజీలతో కూడిన అభియోగపత్రాన్ని పోలీసులు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో దాఖలు చేశారు. ప్రభుత్వం తరఫున 15 సాక్ష్యాలు 34 పత్రాలతో కలిపి పోలీసులు ఈ అభియోగపత్రాన్ని దాఖలు చేశారు.

మేల్ మరువత్తూర్‌లో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఆదిపరాశక్తి సన్నిధి వద్ద అఖండ దీపంతో యువతులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మేల్ మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 12వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈసందర్భంగా బుధవారం తెల్లవారు జామున మంగళ వాయిద్యాలతో ఆదిపరాశక్తి అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. ఉదయం 10 గంటలకు ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ఉద్యమ ఛైర్ పర్సన్ లక్ష్మీ బంగారు అడిగళార్ ఆదిపరాశక్తి సన్నిధి ఎదుట అఖండ దీపాన్ని వెలిగించి యువతికి అందజేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. తరువాత ఆ అఖండ దీపాన్ని ముగ్గురు యువతులు అమ్మవారి నామాన్ని స్మరిస్తూ ఆలయ ప్రాంగణాన్ని ప్రదక్షిణగా చుట్టి వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో మహాలయ అమావాస్య యాగ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆషా అన్బళగన్, శ్రీలేఖ సెందిల్ కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఏర్పాట్లను లక్ష్మీ బంగారు అడిగళార్ నేతృత్వంలో ఆదిపరా శక్తి ఆధ్యాత్మిక ఉద్యమ వైస్ ఛైర్మెన్లు కె.బి సెందిల్ కుమార్, శ్రీదేవి రమేష్, తదితరులు సమీక్షిస్తున్నారు.

వృద్ధుల కోరికను నెరవేర్చిన కలెక్టర్



వృద్ధులతో పడవలో ప్రయాణిస్తున్న కలెక్టర్ క్రాంతికుమార్ పాడి

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోయంబత్తూరులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న వృద్ధులు తమను పడవ స్వారీ తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ప్రత్యేక పడవను ఏర్పాటు చేసి ఉక్కడం చెరువులో కలెక్టర్ వృద్ధులతో ప్రయాణించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు: కోవి.చెళియన్



మాట్లాడుతున్న మంత్రి కోవి.చెళియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అట్టడుగు, అణగారిన వర్గానికి చెందిన తనను ఉన్నత విద్యాశాఖ మంత్రిగా నియమించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ తెలిపారు. బుధవారం ఆయన తిరుచ్చి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో అన్ని శాఖల్లో తమిళనాడు ముందంజలో ఉండాలని ముఖ్యమంత్రి స్టాలిన్ విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నారని చెప్పారు.

పోలీసుశాఖలో ఐదుగురికి గాంధీ పురస్కారాలు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రొహిబిషన్, ఎక్సైజ్ విధుల్లో ఉత్తమంగా వ్యవహరించిన ఐదుగురు పోలీసులకు గాంధీ పురస్కారాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. విళుపురం జిల్లా సెంట్రల్ ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టరు చిన్నకామనన్, విళుపురం తాలూకా పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మగామార్క్స్, తిరుచ్చి జిల్లా తురైయూర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ కార్తిక్, సేలం జిల్లా సాయుధదళం సెకండ్ గ్రేడ్ పోలీసులు శివ, పూమాలైలకు గాంధీ పురస్కారాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. వచ్చే ఏడాది జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకల్లో వారికి పురస్కారాలతో పాటు రూ.40 వేలు నగదు బహుమతి అందించనున్నట్లు వెల్లడించింది.


తిరునెల్వేలి: పాలయంకోట్టై హైగ్రౌండ్ రోడ్డులోని ఖాదీ దుకాణంలో పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టరు డాక్టరు కె.పి కార్తికేయన్


రెడ్‌హిల్స్: తిరువళ్లూరు కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్


అరక్కోణం: రాణిపేట బస్టాండు ముత్తుకడ వద్ద పూలమాల వేస్తున్న మంత్రి ఆర్.గాంధీ


ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ పి.విశ్వనాథన్ తదితరులు

కాంచీపురం: గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంచీపురం నగర కాంగ్రెస్ కమిటీ తరఫున మత సామరస్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో కాంచీపురం మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పి. విశ్వనాథన్ పాల్గొన్నారు.


కేసరి పాఠశాలలో విజేతలతో నిర్వాహకులు

బాపూజీ బాటలో పయనిద్దాం

వడపళని: భారతదేశ పునర్నిర్మాణానికి గాంధీజీ చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడని కేసరి మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగసుందరం గోపాలయ్య అన్నారు. మైలాపూరులోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అమరజీవి విగ్రహానికి కమిటీ ఛైర్మన్ కాకుటూరి అనిల్ కుమార్‌రెడ్డి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సభకు అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా, సభ్యులు నారాయణ గుప్తా ఉపన్యాసం చేశారు. కమిటీ సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి అంజలి ఘటించారు. గాంధీజీ బాటలో విద్యార్థులు పయనించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు 'భారత దేశ పునర్నిర్మాణంలో గాంధీజీ పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. విజేతలకు బహుమతులు అందించారు. కోశాధికారి వి.కృష్ణారావు, నిర్వాహక కమిటీ సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ విప్పాలి శంకరరావు, డాక్టర్ ఏవీ శివకుమారి పాల్గొన్నారు. ప్రముఖ గాయకులు ఎమ్మార్ సుబ్రహ్మణ్యం, అరుణా సుబ్రహ్మణ్యం ఆలపించిన దేశభక్తి గీతాలు అలరించాయి.

అరక్కోణం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాణిపేట జిల్లా ఆర్కాడు యూనియన్‌లోని కల్లియవాడిలో ప్రత్యేక గ్రామసభ జరిగింది. చేనేత శాఖ మంత్రి ఆర్.గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాణిపేట కలెక్టర్ చంద్రకళ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప గోరమంగళంలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే చంద్రన్ అధ్యక్షత వహించారు. మంత్రి నాజర్ ముఖ్య అతిథిగా హాజరై 700 మంది నుంచి వినతులు స్వీకరించారు. గాంధీమార్గంలో పయనించాలని తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మంత్రి నాజర్

వడపళని: ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్ మద్రాస్ ఆధ్వర్యంలో టీనగర్ శ్రీ రామకృష్ణ మిషన్ శారదా విద్యాలయ బాలికల మహోన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయిని ఎస్. శాంతి, ఎక్స్‌నోరా కో-ఆర్డినేటర్ సంగీత సంజయ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. వసుంధర, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, లయన్స్ అధ్యక్షుడు ఆర్.విశ్వనాథన్, ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై అధ్యక్షుడు గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న చిన్నారి సహానా


చెత్తను కుండీల్లో పోస్తున్న న్యాయమూర్తి సెంతమిళ్‌సెల్వన్

కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేసిన న్యాయమూర్తి

ఊత్తుకోట: ఊత్తుకోటలో క్రిమినల్, సివిల్ కోర్టులో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా న్యాయమూర్తి సెంతమిళ్‌సెల్వన్ కోర్టు ప్రాంగణాన్ని బుధవారం శుభ్రం చేశారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు వేల్‌మురుగన్, కార్యదర్శి కవిభారతి, కోశాధికారి నరసింహన్ తదితర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి టీఎం అన్బరసన్

శ్రీపెరుంబుదూర్: కాంచీపురం జిల్లా కుండ్రత్తూర్ పంచాయతీ యూనియన్ వరదరాజపురం పంచాయతీ అష్టలక్ష్మీనగర్‌లో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఎంపీ టీఆర్ బాలు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్ పాల్గొన్నారు. పలువురు అధికారులు హాజరయ్యారు.


ప్యారిస్: గిండీ గాంధీ మండపంలోని బాపూజీ విగ్రహానికి అన్నాడీఎంకే తరఫున నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రులు పొన్నయ్యన్, జయకుమార్ తదితరులు

14 మంది అధికారుల సస్పెన్షన్ వ్యవహారం ప్రభుత్వ ఉత్తర్వులకు స్టే

ప్యారిస్, న్యూస్‌టుడే: కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల ఇళ్ల పట్టాలకు ఆమోదం ఇవ్వడంలో అక్రమాలకు పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు మద్రాసు హైకోర్టు స్టే విధించింది. సేలంలోనూ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల ద్వారా ఇంటి పట్టాలకు ఆమోదం ఇవ్వడంలో అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్రత్యేక ఆడిట్ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని అవినీతి నిరోధక శాఖ(అనిశా)ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. హౌసింగ్ సొసైటీ రిజిస్ట్రార్ భాస్కరన్, సబ్ రిజిస్ట్రార్లు తదితర 14 మందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని వ్యతిరేకిస్తూ 14 మంది మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. నిబంధనల ప్రకారం ఇళ్ల పట్టాలకు ఆమోదం ఇచ్చిన స్థితిలో తమ సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని, అనిశా దర్యాప్తుపై నిషేధం విధించాలని కోరారు. ఈ పిటిషను విచారించిన న్యాయమూర్తి అనిశా దర్యాప్తునకు స్టే విధించారు. విచారణను 15కి వాయిదా వేశారు.

ప్రసవ మరణాలు తగ్గించేందుకు ఆరోగ్యశాఖ కమిటీల ఏర్పాటు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రసవ మరణాల శాతాన్ని రానున్న రెండేళ్లలో 10శాతానికంటే తగ్గించేందుకు ఆరోగ్యశాఖ రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో కమిటీలు నియమించనుంది. ఆరోగ్యశాఖ కార్యదర్శి సుప్రియ సాహు విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో ప్రసూతి మరణాల నిష్పత్తి ప్రస్తుతం లక్ష జననాలకు 45.5గా ఉందన్నారు. గర్భధారణ సంబంధిత మరణాల్లో 80శాతం నివారించదగినవేనని తెలిపారు. ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. కారణాలు గుర్తించి మరణాల నియంత్రనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత వంటి అంశాలను గుర్తించేందుకు వివిధ ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేయడం, గర్భిణులందరికీ ప్రసవానంతరం సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

దళపతి 69 పూజా కార్యక్రమం 4న!

చెన్నై, న్యూస్‌టుడే: విజయ్ తదుపరి చిత్రానికి 'దళపతి 69'గా తాత్కాలిక టైటిల్ పెట్టిన విషయం తెలిసిందే. విజయ్ రాజకీయాల్లోకి రావడంతో ఇదే ఆయన చివరి చిత్రంగా ప్రచారం జరుగుతోంది. చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం, అనిరుద్ సంగీతం అందించనున్నారు. ప్రసిద్ధ నిర్మాణ సంస్థ కేవీఎన్ తమిళంలో నిర్మించే తొలి చిత్రం ఇది కావడం గమనార్హం. ఇందులో 'యానిమల్' చిత్ర ప్రతినాయకుడు బాబి దేవోల్ నటించనున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది. నాయికగా పూజా హెగ్డే నటించనున్నట్టు బుధవారం ఉదయం ప్రకటించింది. తర్వాతి కొద్దిసేపటికి మమితా బైజూ నటించనున్నట్లు కూడా వెల్లడించింది. పూజా కార్యక్రమం 4న జరగనున్నట్లు సమాచారం.

రాజపుత్తిరన్ ఫస్ట్‌లుక్ పోస్టర్

చెన్నై, న్యూస్‌టుడే: మగా కందన్ దర్శకత్వంలో ప్రభు, వెట్రి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'రాజపుత్తిరన్'. కృష్ణప్రియ నాయకగా నటించగా తంగదురై, మన్సూర్ అలిఖాన్, ఇమాన్ అణ్ణాచ్చి తదితరులు ఇతర ముఖ్య నటీనటులు. క్రిసెంట్ సినీ క్రియేషన్స్ పతాకంపై నిర్మితమైన ఈ చితారనికి నౌఫాల్ రాజా సంగీతం సమకూర్చారు. దివంగత నటుడు శివాజీ గణేశన్ జయంతి సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది.



అమరన్ నుంచి రేపు పాట విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివకార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. రానున్న 31న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రంలోని 'హే మిన్నలే' పాటను శుక్రవారం విడుదల చేయనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌కు ఇది 700 పాట కావడం గమనార్హం. ఇదిలా ఉండగా శివకార్తికేయన్‌కు చెందిన ఎస్కే ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించే ఏ చిత్రానికీ కాస్టింగ్ ఏజెంట్లను నియమించలేదని తన అధికారిక 'ఎక్స్' పేజీ ద్వారా ఆ సంస్థ స్పష్టం చేసింది. దీనికి విరుద్ధంగా వచ్చే ఇ-మెయిల్, వార్తలు, సామాజిక మాధ్యమాల పోస్టులను నమ్మవద్దని కోరింది. శివకార్తికేయన్ ప్రొడక్షన్స్ పేరును దుర్వినియోగం చేసేవారిపై తగిన చట్టపరమైన చర్యలను చేపట్టనున్నట్లు హెచ్చరించింది.



చిత్రం పోస్టరు

ఏటీఎం దోపిడీ ముఠా పట్టివేత రాష్ట్ర పోలీసులకు గర్వకారణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: బ్యాంకు ఏటీఎం దోపిడీ ముఠాను పట్టుకున్న ఘనత నామక్కల్ జిల్లా పోలీసులకు మాత్రమేకాక రాష్ట్ర పోలీసులకు గర్వకారణమని డీజీపీ శంకర్ జివాల్ ప్రశంసించారు. గతనెల 28న కేరళ రాష్ట్రం త్రిశూర్‌లోని మూడు ఏటీఎంలు దోచుకొని తమిళనాడు వైపు వస్తున్న హరియాణాకి చెందిన దోపిడీ ముఠాను నామక్కల్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కాల్పుల్లో ముఠా సభ్యుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అయిదుగురిని అరెస్టు చేశారు. దుండగుల దాడిలో కుమారపాలయం ఇన్‌స్పెక్టర్ దవమణి, ఏఎస్సై రంజిత్‌కుమార్ గాయాలపాలై నామక్కల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డీజీపీ శంకర్ జివాల్ బుధవారం వారిని పరామర్శించారు. అనంతరం నామక్కల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.రాజేష్‌కణ్ణన్, ముగ్గురు డీసీపీలు, మొత్తం 23 మందికి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు.


రంజిత్‌కుమార్‌ను పరామర్శిస్తున్న డీజీపీ





మెరీనాలో బుధవారం జరిగిన వాయుసేన పూర్వాభినయ విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. –న్యూస్‌టుడే, వడపళని

రాజకీయలబ్ధికి నిరాహారదీక్ష తగదు: దురైమురుగన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ముల్లైపెరియార్ డ్యామ్ వ్యవహారంలో రాజకీయ లబ్ధికోసం ప్రజలను గందరగోళానికి గురి చేయకూడదని మంత్రి దురైమురుగన్ అన్నాడీఎంకేను కోరారు. డ్యామ్‌లో 152 అడుగుల వరకు నీరు నిల్వ చేయకపోవడాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే నిరాహారదీక్ష ప్రకటించింది. ఈ నేపథ్యంలో దురైమురుగన్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫారెస్ట్ ఫోర్స్ హెడ్‌గా బాధ్యతల స్వీకరణ

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడు ఫారెస్ట్ ఫోర్స్ హెడ్‌గా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(పీసీసీఎఫ్) శ్రీనివాస్ ఆర్.రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉన్న సుదాన్షు గుప్తా పదవీ విరమణ చేయడంతో శ్రీనివాస్ ఆర్.రెడ్డి నియమితులయ్యారు. చెన్నైలోని అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.


శ్రీనివాస్ ఆర్.రెడ్డి

విజయ్ అమృతరాజ్ పేరిట ప్రేక్షకుల గ్యాలరీ




పెవిలియన్ ప్రారంభిస్తున్న ఉదయనిధి స్టాలిన్, చిత్రంలో విజయ్ అమృతరాజ్, ఎంపీ దయానిధి మారన్ తదితరులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నై నుంగంబాక్కంలోని ఎస్డీఏటీ టెన్నిస్ మైదానంలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు విజయ్ అమృతరాజ్ పేరుతో మంగళవారం ప్రేక్షకుల గ్యాలరీ(పెవిలియన్) ప్రారంభించారు. ఎంపీలు దయానిధిమారన్, డాక్టర్ కళానిధి వీరాసామి, కార్తి చిదంబరం, టెన్నిస్ క్రీడాకారుడు విజయ్ అమృతరాజ్, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి అదనపు ముఖ్య కార్యదర్శి డాక్టర్ అతుల్య మిశ్రా, ఎస్డీఏటీ సభ్య కార్యదర్శి జె.మేఘనాథరెడ్డి, టెన్నిస్ సంఘ కార్యదర్శి వెంకటేష్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండు బల్బులు.. బిల్లు రూ.లక్షకు పైగానే

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా కొడైకెనాల్ సమీపంలోని కొండ ప్రాంత గ్రామమైన పళమ్‌పుతూర్‌కు చెందిన రైతు చంద్రశేఖర్ ఇంట్లో ఇటీవల విద్యుత్ రీడింగ్ తీశారు. మంగళవారం ఆయన ఫోన్‌కు రూ.1,01,580 ఛార్జీ చెల్లించాలంటూ మెసేజ్ వచ్చింది. ఇతను ఇంట్లో రెండు బల్బులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. వంద యూనిట్ల కంటే తక్కువగానే విద్యుత్ వినియోగిస్తున్నందున ఛార్జీ చెల్లించలేదు. ఇప్పుడు 9,200 యూనిట్ల విద్యుత్ వినియోగించారని పేర్కొన్నారు. కొడైకెనాల్ విద్యుత్ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ కుమార్ మాట్లాడుతూ రైతు చంద్రశేఖర్ 92 యూనిట్లు మాత్రమే వినియోగించారని సిబ్బంది నమోదు చేసేటప్పుడు అదనంగా రెండు సున్నాలు వేయడంతో 9200గా నమోదైందన్నారు. అందుకే అంతపెద్ద మొత్తం చెల్లించాలని మెసేజ్ వచ్చిందన్నారు. దిండుక్కల్ జిల్లా విద్యుత్ బోర్డు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వంద యూనిట్ల కంటే తక్కువగా వినియోగిస్తున్నందున ఛార్జీ చెల్లించనవసరం లేదన్నారు.



రైతు చంద్రశేఖర్, ఫోన్‌కు వచ్చిన సంక్షిప్త సందేశం

రెండోరోజు కొనసాగిన దర్యాప్తు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: ఈసా యోగా కేంద్రంలో పోలీసులు బుధవారం కూడా దర్యాప్తు కొనసాగించారు. కోవై ఎస్పీ కార్తిగేయన్ నేతృత్వంలో డీఎస్పీ శివకుమార్‌తో పాటు 50 మందికి పైగా అధికారుల బృందం దర్యాప్తులో పాలుపంచుకుంది. కామరాజర్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి ఈ దర్యాప్తు జరుగుతోంది. మరోపక్క కామరాజర్ కోర్టులో చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదని ఈసా కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

వృద్ధురాలి మృతదేహం స్వాధీనం

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీప రాజాపాళ్యానికి చెందిన విశ్వనాథ్‌రావు విశ్రాంత సైనికుడు. ఇతని భార్య చంద్రబాయి(75) ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఇతని కుమార్తె లక్ష్మీబాయి బుధవారం ఉదయం తన తల్లికి ఫోన్ చేయగా తీయలేదు. దీంతో అనుమానంతో సమీప వీధిలోని లక్ష్మీబాయి అక్కడకు చేరుకోగా చంద్రబాయి రక్తపు మడుగులో మృతదేహంగా పడి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. చంద్రబాయిని ఎవరు? ఎందుకు హత్య చేశారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను ఎగతాళి చేసిన యువకుడు మందలించిన తండ్రి దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బాలికను ఎగతాళి చేసినందుకు మందలించాడన్న కోపంతో ఆమె తండ్రిని ఓ యువకుడు హత్య చేశాడు. పోలీసుల కథనం మేరకు.. పుదుకోట్టైకు చెందిన మురుగన్(21) అదే ఊరికి చెందిన తన బంధువు కుమార్తె 14ఏళ్ల బాలికను తరచూ ఎగతాళి చేసేవాడు. మంగళవారం బాలిక ఏడుస్తూ వచ్చి జరిగిన విషయాన్ని తండ్రికి తెలిపింది. ఆయన మురుగన్‌ను మందలించాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడు ఇంటికెళ్లి కత్తి తీసుకొచ్చి బాలిక తండ్రిని విచక్షణరహితంగా పొడిచి చంపాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి మురుగన్‌ని అరెస్ట్ చేశారు.

కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి జిల్లా లాల్‌కుడి సమీపంలోని ఆదిక్కుడి గ్రామానికి చెందిన రాజేష్‌కు ఆరేళ్ల క్రితం అనసూయ(30)తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. జోతిష్యం వృత్తిగా పెట్టుకున్న రాజేష్ మద్యానికి బానిసగా మారాడు. తరచూ మద్యం తాగి వచ్చి భార్య, పిల్లలను కొట్టేవాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతూ వచ్చాయి. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఎప్పటిలాగే మద్యం తాగి వచ్చిన రాజేష్ భార్యతో గొడవపడి కత్తితో నరికి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి రాజేష్ కోసం గాలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి చింతామణి ప్రాంతానికి చెందిన రాజేష్ కుమారుడు అజయ్(12) ఏడో తరగతి చదువుతున్నాడు. ఇతను మంగళవారం రాత్రి వీధిలో ఆడుకుంటూ అక్కడే ఉన్న విద్యుత్ స్తంభంపై చెయ్యి పెట్టాడు. ఆ సమయంలో వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్ కొట్టి కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డోనట్ బోట్‌కు విశేష స్పందన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మొదటిసారిగా ఊటీ బోట్‌హౌస్‌లో పరిచయం చేసిన 'డోనట్ బోట్'కు పర్యాటకుల నుంచి విశేషస్పందన లభించింది. ఎలాంటి శబ్దం లేకుండా వేడివేడి టీ తాగులూ, కట్‌లెట్, సమోసా తింటూ విద్యుత్తు పడవలో పయనించడం హాయిగా ఉందని పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు. 20 నిమిషాల ప్రయాణానికి 5 మందికి రూ.1,200 ఛార్జీ వసూలు చేస్తున్నారు.


పడవ సవారీలో పర్యాటకులు

రేషన్ బియ్యం స్వాధీనం

అరక్కోణం, న్యూస్‌టుడే: అరక్కోణం రైల్వేస్టేషన్ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైళ్లలో బియ్యం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, యార్డు ప్రాంతాల్లో బుధవారం రైల్వే పోలీసులు తనిఖీ చేపట్టారు. ఐదో నెంబరు ప్లాట్‌ఫాం చివరన దాచి ఉంచిన 40 రేషన్ బియ్యం బస్తాలు(25 కిలోలవి) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

చిరుతను కాల్చి చంపిన ముగ్గురి అరెస్టు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: సేలం జిల్లా మేటూర్ సమీప కొలత్తూర్ చిన్నప్పంపట్టి గ్రామ పంచాయతీ పరిధిలో గల పుదువేల మంగళం, కరుంగాడు, వెల్లక్కాడు, మొదలైన ప్రాంతాల్లో గత నెల రోజులుగా చిరుత సంచరిస్తూ కోళ్లను, పశువులను, మేకలను వేటాడుతూ ఆయా ప్రాంతాల ప్రజలను ఆందోళనకు గురి చేసింది. ఈస్థితిలో గత నెల 26వ తేది చిరుత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. కాగా పోస్టుమార్టం నివేదికలో చిరును గుర్తు తెలియని వ్యక్తులు నాటు తుపాకితో కాల్చి చంపినట్లు తెలియడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. విచారణలో చిరుతను కాల్చి చంపింది మాజీ పీఎంకే పంచాయతీ అధ్యక్షుడు మునుసామి, అతని స్నేహితులు శశి, రాజాగా గుర్తించి వారిని అరెస్టుచేసి వారి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని వారి వద్ద అధికారులు విచారణ జరపగా గత నెల 25 వతేదీన చిరుత సంచరిస్తున్న ప్రాంతానికి చేరుకొని నాటు తుపాకీతో కాల్చి దగ్గరికి వెళ్లి చూడగా ప్రాణంతో ఉన్నట్లు గురించి తలపై కర్రతో కొట్టి చంపినట్లు వాంగ్మూలం ఇచ్చారు. నిందితులను సేలం కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు.

చోరీకి పాల్పడిన నలుగురు..

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై అడయార్‌లో ఉన్న ఇంద్రానగర్‌లో సరోజా అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. ఆమెకు తోడుగా కడలూరుకు చెందిన రాజామణి అనే మహిళ ఉంటోంది. కొన్ని రోజుల కిందట రాజామణి పనిమానేసి తాను పనిచేసిన వృద్ధురాలి వద్ద నగలు ఉన్నట్లు తన స్నేహితులకు తెలిపి అందరు కలిసి నగలు చోరీ చేయడానికి కుట్ర పన్నారు. గత నెల 20న రాజామణి తన స్నేహితులతో కలిసి సరోజా ఇంటికి వెళ్లి ఆమెకు మత్తు మందు ఇచ్చి 15 సవర్ల నగలు చోరీ చేసి పారిపోయారు. ఈ విషయమై వృద్ధురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. అనంతరం కడలూరులో ఉన్న రాజామణి ఆమె స్నేహితులు మనోహరన్, రాజేష్ కుమార్, అతని భార్య భువనేశ్వరిని అరెస్టు చేసి చెన్నైకి తీసుకొచ్చారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.


అరెస్టయిన నిందితులు

గంజాయి విక్రయిస్తున్న..

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కార్పొరేషన్ పరిధిలోని వడవళ్లి పోలీసులు మరదమలైలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడి బస్టాండు వెనుక భాగంలో ముళ్ల పొదల చాటున నలుగురు వ్యక్తులు నిలుచుండడాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. వీరు కమ్మవీరపాళ్యానికి చెందిన మణికంఠన్, సబరిగిరి, ఇస్మాయిల్, గోకుల్‌గా గురి తంచి వీరి 200 నుంచి గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు.

క్రైం కార్నర్

ఇద్దరు జూదరులు..

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆర్కాడు సమీపంలోని మేల్‌విషారం వద్ద కొందరు కాటన్ జూదం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ తిరుమాల్‌కు సమాచారం అందింది. స్పందించిన ఏఎస్పీ వెంటనే కాటన్ జూదాన్ని అదుపు చేయాలని ఆర్కాడు పోలీసు ఇన్‌స్పెక్టరు పార్థసారథిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం మేల్‌విషారం ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి కాటన్ జూదాన్ని నిర్వహిస్తున్న మేల్‌విషారం ప్రాంతానికి చెందిన వెంకటేష్(56), నందియాలం ప్రాంతానికి చెందిన రహీం(54)ను అదుపులోకి తీసుకుని కాటన్ జూదానికి ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు